ప్రజాశక్తి
ఆదివారం 10 డిసెంబర్ 2023 5 అనంతపురం

వ్యవసాయ మోటార్లకు మీటర్లు.. రైతులకు ఉరితాళ్లు..!

ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ ఎదుట నిరసన

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం ద్వారా రైతులకు ఉరితాళ్లు వేసినట్లే అని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు కళ్లుగప్పి దొడ్డిదారిన సర్దుబాటు ఛాలు మోపుతోందన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి సామాన్యులను దోచి కార్పొరేట్ జేబులో నింపేందుకు పూనుకుందన్నారు. అంతేగాకుండా మోడీ ప్రభుత్వం ఆదేశాలకు తలొగ్గిన సిఎం జగన్ ప్రతినెలా వంటగ్యాస్ లాగానే కరెంటు ఛార్జీలను కూడా పెంచడానికి ఆదేశాలు ఇచ్చేశారన్నారు. ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీలు వంటి రకరకాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారన్నారు. వీటన్నింటినీ ఆదిలోనే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్దుబాటు ఛార్జీల విధానాన్ని రద్దు చేయాలని, ట్రూ ఆఫ్ సర్దుబాటు ఛార్జీలు వసూలు నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టరాదని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల సహాయ కార్యదర్శి కొండారెడ్డి, నాయకులు శ్రీనివాసులు, సూర్యప్రకాష్, వెంకట్‌నారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, సుంకన్న, ఆంజనేయులు, జయరాముడు, రామాంజనేయులు, రమేష్, శ్రీనివాసులు, మేకల పెద్దన్న, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, నాగరాజు, చెంగల్.ధనుంజయ, వెంకట్‌నారాయణ, రాముడు, కుళ్లాయిస్వామి, గంపన్న, పెద్ద ఆంజనేయులు, అప్పా రాజు, దొడ్ల అయ్యప్ప, రామదాసు, రాముడు, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రఘువీరా పయనమెటు..!

◆ కళ్యాణదుర్గంలో పోటీ చేయాలని కార్యకర్తల పట్టు ◆ అధిష్టానం నిర్ణయం మేరకేనని ప్రకటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాజీ మంత్రి రఘువీరారెడ్డి రాజకీయ పయనమెటు అన్నది చర్చ నడుస్తోంది. అటు తెలంగాణ, ఇటు కర్నాటక రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. దీంతో ఇక్కడి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లోనూ ఉత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలోనే సిడబ్ల్యుసి సభ్యులుగానున్న ఎన్.రఘువీరారెడ్డి శుక్రవారం నాడు మడకశిర నుంచి కళ్యాణదుర్గ వరకు బైకు ర్యాలీని నిర్వహించారు. ఈ సమయంలో ఆయన ఇక్కడి నుంచి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయన అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఇంట్లోకి వెల్లకుండా బైటాయించారు. అయితే దీనిపై ఆయన ఎటువంటి సమాధానం చెప్పలేదు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే నడుచుకుంటామని ప్రకటించారు. ఆయనకు కళ్యాణదుర్గంలో మంచి పట్టుంది. 2009కి ముందు వరకు ఆయన మడకశిర నియోజకవర్గం నుంచి పోటీ చేసేవారు. 2009 సంవత్సరంలో నియోజకవర్గాల పునర్విభజన తరువాత మడకశిర ఎస్సీకి రిజర్వు అయ్యింది. దీంతో ఆయన నియోజకవర్గాన్ని కళ్యాణదుర్గంకు మార్చుకున్నారు. 2009లో తొలిసారిగా కళ్యాణదుర్గం నుంచి పోటీ చేశారు. ఆ సమయంలో ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా చెరగని ముద్ర వేశారు. ప్రజల్లోనూ మంచి ఆదరణ పొందారు. 2014 ఎన్నికలొచ్చే సరికి రాష్ట్ర విభజన జరగడంతో కాంగ్రెస్ పూర్తిగా గల్లంతైంది. ఆ ఎన్నికల్లో ఆయన ఇక్కడి నుంచి కాకుండా పెనుకొండ నుంచి పోటీ చేశారు. అక్కడ ఓట్లు వచ్చినా ఓటమి తప్పలేదు. ఆ తరువాత 2019లో కళ్యాణదుర్గం నుంచే కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేశారు. మెరుగైన ఓట్లే వచ్చినప్పటికీ ఓటమిని మాత్రం చవిచూడక తప్పలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి కూడా ఆశించినంత లేకపోవడంతో పిసిసి పగ్గాలను వదిలేసి రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఇటీవల జరిగిన కర్నాటక ఎన్నికల సమయం నుంచి తిరిగి రాజకీయాల వైపు దృష్టి సారించారు. కర్నాటక ఎన్నికల్లో పావగడ ప్రాంతంలో ప్రచార బాధ్యతలను నిర్వహించారు. అక్కడ పార్టీ గెలుపునకు కృషి చేశారు. దీంతో ఆయన కర్నాటక రాజకీయాల వైపు దృష్టి పెట్టారన్న ప్రచారం సాగుతూ వస్తోంది. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తుంకూరు నుంచి పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాలున్నాయన్న ప్రచారం కూడా సాగుతోంది. దీనిపై అధికార ప్రకటనేది చేయలేదు. తెలంగాణ ఎన్నికల్లోనూ పార్టీ విజయం సాధించాక ఆయన బైకు ర్యాలీని మడకశిర నుంచి కళ్యాణదుర్గంకు చేపట్టారు. ఈ సమయంలో అభిమానులు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఒత్తిడి చేయడం చర్చనీయాంశమవుతోంది. మరోమారు అసెంబ్లీ బరిలోకి ఇక్కడి నుంచే దిగుతారా అన్నది చర్చ నడుస్తోంది. మరోవైపు విజయావకాశాలు మెండుగానున్న కర్నాటకలో పార్లమెంటుకు పోతారా అన్న మీమాంశ ఉంది. ఆయన మాత్రం అధిష్టనం నిర్ణయం మేరకు నడుచుకుంటానని చెప్పారు. ఏదిఏమైనా 2019 ఎన్నికల నుంచి రాజకీయాలకు దూరంగానున్న ఆయన వచ్చే సార్వత్రిక ఎన్నికల సమయంలో మాత్రం ఏదోక చోటు నుంచి తిరిగి రంగ ప్రవేశం చేస్తారన్న సంకేతాలు మాత్రం వెలువడతూ ఉన్నాయి.

కంది పంటకు రూ.50వేలు నష్ట పరిహారం ఇవ్వాలి

ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి

కంది పంటను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మించౌన్ తుఫాన్ కారణంగా పూర్తిగా దెబ్బతిన్న కంది పంట సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.50వేలు పంట నష్ట పరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని వెంకటరెడ్డిపల్లి గ్రామంలో తుఫాన్‌కు దెబ్బతిన్న కందిపంటను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చాలామంది రైతులు కంది సాగు చేసి దిగుబడి లేక దిక్కుతోచనిస్థితిలో ఉన్నారన్నారన్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ముంచుకొచ్చిన కరువులో ఇలా అనేక రకాల పంటలు ఎండిపోవడం బాధాకరమన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చి కంది సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు జయశేఖర్‌రెడ్డి, రైతులు భూపాల్, హరినాథ్‌రెడ్డి, నాగయ్య, నగేష్, మణికొండ, తదితరులు పాల్గొన్నారు.

కాలువలు ఆక్రమిస్తే ఉపేక్షించొద్దు : మేయర్

కాలువలను పరిశీలిస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో కాలువలను ఆక్రమిస్తే ఉపేక్షించొద్దని మేయర్ మహమ్మద్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని 39వ డివిజన్ పరిధిలో ఉన్న రవి పెట్రోల్ బంకు సమీపంలో కాలువపై పైపులు వేసి వాటర్ సర్వీస్ మెకానిక్ షెడ్ ఏర్పాటు చేసుకున్నారు. దీంతో శనివారం కురిసిన వర్షానికి వర్షం నీరు ముందుకు వెళ్లని పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న మేయర్ అక్కడికి వెళ్లి దగ్గరుండి కాలువపై అక్రమంగా వేసిన కల్వర్టును తొలగించారు. వీటితోపాటు నగరంలో ఎక్కడైనా కాలువలపై అక్రమంగా ఉన్న కల్వర్టులు, కట్టడాలను తొలగించాలని ఆదేశించారు. అదేవిధంగా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెల్తాఫీసర్ సంగం శ్రీనివాసులు, ఇఇ సూర్యనారాయణ, డిఇఇలు సుబాష్, రవీంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూలకుంటకు దారేదీ..?

300 ఏళ్ల గ్రామానికి రహదారి శూన్యం
గుంతల రహదారితో ప్రజల అవస్థలు

గుంతలమయంగా మారిన పూలకుంట రోడ్డు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీలో ఉన్న మజరా గ్రామం పూలకుంటకు ఎన్నోఏళ్లుగా రహదారి నిర్మాణం లేదు. యాడికి మండలం నగరూరు గ్రామానికి చెందిన వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన కొందరు గుత్తి మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలో నివాసాలు ఏర్పరచుకుని స్థిరపడ్డారు. 300ఏళ్ల క్రితం పూలకుంట గ్రామంగా ఏర్పడింది. అయితే ఆ గ్రామానికి రహదారి నిర్మాణం లేదు. గతంలో ఎద్దుల బండి జాడ అనగానిదొడ్డి గ్రామ సమీపంలో ఉన్న కరణం వాళ్ల చింతచెట్టు వరకూ ఆరు కిలోమీటర్ల మేర ఉండేది. పంటల సాగు, వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఆ దారి దూరం కావడంతో నాగసముద్రం గ్రామ మలుపు వరకూ పూలకుంట గ్రామస్తులు ప్రయాణం కొనసాగించేవారు. అటు నుంచి మండల కేంద్రానికి రాకపోకలు సాగించేవారు. అయితే పూలకుంట గ్రామం నుంచి కిలోమీటర్ దారి గుంతలమయమైంది. వర్షం వస్తే దారి పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఈ ఏడాది పీర్ల పండగ సమయంలో గ్రామానికి వెళ్తున్న తిమ్మన్న అనే వ్యక్తి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం ఎన్.రంగాపురం గ్రామానికి చెందిన రామాంజనమ్మ గ్రామానికి వెళ్తూ ప్రమాదానికి గురై తీవ్రగాయాలయ్యాయి. అలాగే గ్రామానికి చెందిన పలువురు రోడ్డు ప్రమాదాలు గురై గాయపడ్డారని గ్రామస్తులు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు వెళ్లేందుకు కూడా వీలు లేకుండా పోయింది. గర్భిణులు, ప్రమాదాలు గురైన వారు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలంటే నాగసముద్రం గ్రామం మలుపు రహదారి వరకూ రావాల్సి ఉంటుంది. అక్కడ నుంచి సేవాఘడ్ వరకూ రూ.లక్షలు వెచ్చించి 20 ఏళ్ల క్రితం వేసిన తార రోడ్డు ధ్వంసమై కంకర తేలడం పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత టిడిపి హయాంలో ఆ గ్రామానికి రహదారి నిర్మాణానికి రూ.లక్షలు నిధులు మంజూరయ్యాయి. అయితే ఓ టిడిపి నాయకుడు ఆ నిధులు మళ్లించి తన గ్రామానికి తారు రోడ్డు నిర్మించుకున్నారు. పూలకుంటకు వెళ్లే రహదారి ఇరువైపులా కంపచెట్లు, ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో ఇటీవల బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచి నగరూరు సుమలత, వైసిపి నాయకుడు నగరూరు రాజశేఖర్ జెసిబితో తొలగించారు. రహదారి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుత దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామానికి రహదారి నిర్మించాలని కోరుతున్నారు.

విద్యార్థులు మానసిక సామర్థ్యం పెంచుకోవాలి

ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఉపాధ్యక్షులు డాక్టర్ జివి.మూర్తి

మాట్లాడుతున్న ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఉపాధ్యక్షులు డాక్టర్ జివి.మూర్తి

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించాలంటే విద్యార్థులు చదువుతోపాటు మానసిక ధృడత్వాన్ని పెంపొందించుకోవాలని ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ జాతీయ ఉపాధ్యక్షులు జివి.మూర్తి, సౌత్‌జోన్ అధ్యక్షులు డాక్టర్ ఉదయ్, జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ సూచించారు. శనివారం 'మానసిక ఒత్తిళ్ల-సమస్యలు-పరిష్కారాలు' అనే అంశంపై ఐద్వా, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన ఆదిమూర్తినగర్‌లోని బాలికల సంక్షేమ వసతిగృహంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతి వందమందిలో 70 శాతం మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారన్నారు. ముఖ్యంగా యువత మద్యం, మాదక ద్రవ్యాలు చెడు అలవాట్లకు బానిసలై సమస్యలకు గురవుతున్నారని వివరించారు. 12 ఏళ్ల నుంచి 20 సంవత్సరాల్లోపు యువత హార్మోన్స్ ప్రభావాలతో ఒత్తిడికి గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థి దశలోనే శారీరక ధృడత్వంతో పాటు మానసిక ధృడత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆడపిల్లలు జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రేమ పేరుతో వంచినకు గురికాకూడదన్నారు. మొబైల్స్ ఫోన్లకు బానిసలు కావడం, ఒత్తిళ్లలకు లోనై ఆత్మహత్యలకు ప్రేరేపణ కావడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. చిన్న, చిన్న సమస్యలు తలెత్తినప్పుడు తల్లిదండ్రులు, దగ్గరి మిత్రులు, గురువులతో పంచుకుని సమస్య నుంచి బయటపడాలన్నారు. ప్రతి మనిషిలోనూ మానసిక ఒత్తిడి తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. ఒత్తిడికి గురికాకుండా మసులు కోవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు జీవితంలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. క్రమశిక్షణ, ఏకాగ్రత, క్యారక్టర్, కాండక్ట్, కమ్యూనికేషన్ వంటి అంశాలపై ధృడత్వాన్ని పొందాలన్నారు. ఆడపిల్లలు ఏదైనా మానసిక సమస్యలు ఉంటే (నామి) నేషనల్ అలయన్స్ మెడికల్ ఇన్‌స్టిట్యూషన్ వారికి 800900, 741741 నెంబర్లకు సంప్రదించి సూచనలు, సలహాలు పొందవచ్చురన్నారు. విశాఖపట్టణం ఎయిమ్స్ హెచ్‌ఒడి డాక్టర్ విజయచంద్రారెడ్డి మాట్లాడుతూ మానసిక ప్రశాంత మనిషి జీవితానికి ఎంతో అవసరం అన్నారు. ఒత్తిడి గురికాకుండా అధిగమించే ధృడత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న హింస నిర్మూలించడానికి హింస లేని సమాజాన్ని నిర్మూలించుకోవాలన్నారు. అందుకు ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉంటి తోటి వారికి ఇబ్బందులకు గురి చేయకుండా మసలుకోవాలన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ సైకియాట్రాకి సొసైటీ ఎడిటర్ డాక్టర్ ఐవిఎల్ శరత్, ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, ప్రభుత్వ బాలకల సంక్షేమ వసతిగృహం వార్డెన్లు మాధవీలత, వసంత, విద్యార్థినులు పాల్గొన్నారు.

టిడిపితోనే ముస్లిముల అభివృద్ధి

ముస్లిం మైనారిటీ నాయకులు సాలార్ బాషా

విలేకరులతో మాట్లాడుతున్న ముస్లిం మైనారిటీ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడిపితోనే ముస్లిం మైనారిటీల అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి జిల్లా మైనారిటీ సీనియర్ నాయకులు సాలార్‌బాషా, జెఎం.బాషా, సైబుద్దీన్, అజీజ్, రఫీ అన్నారు. శనివారం అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింలపై దాడులు పెరిగిపోయాయని, ఇటీవల ధర్మవరంలో చేనేత కార్మికుడు ఇలియాజ్‌పై దాడి చేయడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. టిడిపి ప్రభుత్వంలో ముస్లిముల అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పథకాలన్నింటినీ రద్దు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని ముస్లిముల అభివృద్ధికి టిడిపి కట్టుబడి ఉందన్నారు.

రాష్ట్రస్థాయి ఎన్నికలకు సిద్ధం కావాలి

ఆల్ మేవా జిల్లా అధ్యక్షులు వై.షేక్షావలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) రాష్ట్ర స్థాయి నూతన కార్యవర్గం ఏర్పాటుకు ఈనెల 25న కర్నూలులో నిర్వహిస్తున్న ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పని చేస్తున్న ముస్లిం మైనార్టీ క్రిస్టియన్ ఉద్యోగులు సంసిద్ధులు హాజరుకావాలని ఆల్ మేవా జిల్లా అధ్యక్షులు వై.షేక్‌షావలి పిలుపునిచ్చారు. శనివారం అనంతపురం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆల్ మేవా జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తొలుత నంద్యాలలో ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ. 12 కోట్ల వ్యయంతో 6 నూతన ఉర్దూ జూనియర్ కళాశాల, మైనార్టీ వసతి గృహం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, సద్భావన బిల్డింగు, ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ విద్యార్థుల నూతన భవనాల నిర్మాణానికి కృషి చేసిన సిఎం జగన్‌కి ఆల్‌మేవా సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముస్లిం మైనారిటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా మైనార్టీల సంక్షేమం కోసం నిర్దేశించిన ప్రధానమంత్రి 15 సూత్రాల మైనార్టీ పథకాన్ని జిల్లాలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో 15 శాతం రిజర్వేషన్లు మైనార్టీలకు అమలు చేయాలని, రాష్ట్రంలో దురాక్రమణలకు లోనైనా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్‌మేవా రాష్ట్ర సహాధ్యక్షులు ఫక్రుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫరూక్ అహ్మద్, జిల్లా కోశాధికారి దౌలా, ఉపాధ్యక్షులు జిలాన్, అశ్రఫ్ అలీ, ఏఎం బాషా, అన్వర్ అబ్దుల్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆల్ మేవా జిల్లా అధ్యక్షులు వై.షేక్షావలి

'ఓటు' రాజకీయం తగదు : విప్ కాపు

విలేకరులతో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి నాయకులు ఓటరు జాబితాపై లేనిపోని రాజకీయం చేయడం తగదని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి కాలవ శ్రీనివాసులుకు రాయదుర్గం ప్రజలు అంటే ఏంటో చూపిస్తానన్నారు. దొంగ ఓట్లతో వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నాడని ఆరోపించారు. గతంలో తనకు రాయదుర్గంలో 6000 ఓట్ల తక్కువ రాగా ఈసారి అంతకుమించిన మెజారిటీని తాను పొందుతానని ధీమా వ్యక్తం చేశారు. ఒక ఓటరు ఒకే చోట హక్కు కలిగి ఉండాలనే నిబంధనను ఎన్నికల కమిషన్ అమలు చేస్తోందన్నారు. ఇకపోతే నియోజకవర్గంలో తాను గడప గడపకూ వెళ్లానన్నారు. అదే కాలవ శ్రీనివాసులు మాత్రం కేవలం తనకు పరిచయం ఉన్న ఒకరిద్దరి ఇళ్లకు వెళ్లి విందు చేసి వస్తాడన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ పరిస్థితి ఎలా ఉందో తనకు బాగా అవగాహన ఉందన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి నామరూపాలు లేకుండా పోతుందన్నారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ శివప్ప, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భోజరాజునాయక్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, గుమ్మగట్ట జడ్పిటిసి మహేష్, మున్సిపల్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వినియోగంలో చిప్ డిజైనింగ్ కీలకం

జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్

ప్రజాశక్తి-అనంతపురం

ఎలక్ట్రానిక్ వినియోగంలో చిప్ డిజైన్ కీలకపాత్ర పోషిస్తుందని, అందుకు అనుగుణంగా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యత సాధించాలని జెఎన్‌టియు రిజిస్ట్రార్ శశిధర్ సూచించారు. శనివారం స్థానిక జెఎన్‌టియూ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ అధ్యక్షతన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, ఎఐసిటిఇ ట్రైనింగ్, లర్నింగ్ అకాడమీ సెల్, న్యూఢిల్లీ సంయుక్తంగా ఎక్స్ప్లో ది కటింగ్ రింగ్ ది కటింగ్ ఏజ్ వరల్డ్ ఆఫ్ చిప్ డిజైన్ అనే అంశంపై ఆరు రోజులపాటు ఫ్యాకల్టీ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అభ్యసించే విద్యార్థులు తప్పనిసరిగా చిప్ డిజైన్ ప్రాముఖ్యతను తెలుసుకుంటే ఉద్యోగావకాశాలను మెండుగా వస్తాయన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి చంద్రమోహన్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.మమత, అర్జున్, హరి, నాగ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి : సిపిఎం

స్థలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం గ్రామ పంచాయతీ పరిధిలో అన్యాక్రాంతమైన పలు స్థలాలను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ఎల్పీ నెంబర్ 13/94 పంచాయతీ పబ్లిక్ స్థలాన్ని ఓ వ్యక్తి కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఆ లేఔట్‌లో 14 సెంట్ల స్థలం ఉండగా మూడు సెంట్లు కార్మికుల భవనానికి కేటాయించారన్నారు. మిగతా స్థలాన్ని రహదారి కోసం వదిలారన్నారు. ఆ స్థలాన్ని కూడా అమ్మకాలు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. దాని పక్కనే ఉన్న 19 సెంట్లు పబ్లిక్ స్థలంలో ఒక టీ బంకు, శాశ్వత రేకుల షెడ్డును నిర్మించుకున్నారన్నారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ వారు ప్రభుత్వ స్థలాలను విచ్చలవిడిగా కబ్జా చేస్తూ అమ్ముకుంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాయకులు రంగారెడ్డి, జ్ఞానమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారం

అనంతపురం లోక్ అదాలత్‌లో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి, నీటి పన్నులతోపాటు మున్సిపల్ స్థలాల లీజు పన్నుల వసూలుకు శనివారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన లోకదాలత్‌లో రూ.1,58,135 వసూలైంది. 1178 నోటీసులు పంపగా నవంబర్ 24 నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకూ రూ.6,80,457 వసూలైంది. 6వ లోక్ అదాలత్‌లో 33 కేసులు పరిష్కారమయ్యాయి. ఇంకా 1145 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది, బిల్ కలెక్టర్లు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ గుమాస్తాలు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : గుత్తి న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయిమీ సందర్భంగా జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి, మండలం న్యాయ సేవా సమితి అధ్యక్షులు బి.సాదుబాబు, సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ ఆచారి, జూనియర్ సివిల్ జడ్జి వి.దీప్తి కలిసి రూ.1,37,82,980 నగదు చెల్లించేలా కేసులను పరిష్కరించారు. 659 కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మనోహర్‌బాబు, న్యాయవాదులు కె.సూర్యనారాయణ, సోము, విసి.గంగాధర్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, రవీంద్రబాబు, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మహబూబ్‌బాషా

అర్ధాంతరంగా ఆగిన పనులను చూపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలో ఆగిపోయిన అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్, టిడిపి మైనారిటీ విభాగం కన్వీనర్ కె.మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలోని 5వ వార్డులో అర్ధాంతరంగా ఆగిన అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో నిర్మాణ దశలో ఉన్న పనులు ఎక్కడికక్కడ ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా చాకలివీధి, ఓబుళాచారి రోడ్డు, జమ్మిచెట్టు వీధిలో రెండు నెలల క్రితం సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని ఇళ్ల ముందు మెట్లు, ఇతర నిర్మాణాలను తొలగించిన అధికారులు తర్వాత తిరిగి చూడలేదన్నారు. దీంతో ఇళ్లలోకి వెళ్లాలంటే స్థానికులు నానాయాతన పడుతున్నారన్నారు. 8 రోజుల్లోగా పెండింగ్ పనులు పూర్తి చేయకపోతే మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షలు చేపడతానని హెచ్చరించారు.

ఇష్టంతో విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు

సాంఘిక సంక్షేమ శాఖ జెడీ ఎస్.మధుసూదన్‌రావు

మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జెడీ ఎస్.మధుసూదన్‌రావు

ప్రజాశక్తి-గుత్తి

ఇష్టపడి చదివితే విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి అగ్రస్థానంలో నిలుస్తారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.మధుసూదన్‌రావు సూచించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ డివిజన్ పరిధిలోని గుత్తి, గుంతకల్లు, యాడికి, పెద్దవడుగూరు, పామిడి, విడపనకల్లు మండలాల్లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సాంఘిక సంక్షేమ సహాయ అధికారిణి బి.రాధిక ఆధ్వర్యంలో ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎ.రామాంజనేయులు, అధ్యాపకులు సుధీంద్ర, పి.వెంకటరామిరెడ్డి, వసతిగృహాల వార్డెన్లు ఆదినారాయణ, సంజీవరాయుడు, నాగరాజు, మహబూబ్‌బాషా, ఈశ్వరమ్మ, జ్ఞానమ్మ, జ్యోతి, ఉమాదేవి, ఎల్‌డిసి రాధాకృష్ణారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో హోమం

రాయదుర్గం : మండలంలోని బొమ్మకపల్లి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శనివారం ధాత్రి హోమం, కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని స్వకులసాలి సమాజం (చేనేత), పాండురంగ స్వామి యువజన సంఘం, రుక్మిణీ మహిళా మండలి ఆధ్వర్యంలో కార్తీక దామోదర నారాయణస్వామి ధాత్రి హోమం నిర్వహించారు. అనంతరం ఉసిరి చెట్టుకు, రాజరాజేశ్వరి దేవికి పూజలు చేసిన అనంతరం మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం కార్తీక వనభోజనాలు జరిగాయి.

రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం

రాయదుర్గం : రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాయదుర్గం డివిజన్ కార్యదర్శి ఎస్‌వి.ఆంజనేయులు మాట్లాడుతూ 2016 డిసెంబర్ 9న రాయలసీమ హక్కుల పరిరక్షణ కోసం పార్టీ ఏర్పడిందన్నారు. రాయలసీమ హక్కుల సాధన, సమస్యల పోరాటానికై తమ పార్టీ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు మల్లి, తిమ్మప్ప, భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష దీపారాధన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

కార్తీకమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో లక్ష దీపారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన ద్వారం మొదలుకుని ఆలయ గోపురంపై, ఆలయ ఆవరణలో భారీగా దీపాలు వెలిగించి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించి, వెండి కవచం, సువర్ణ కిరీట ధారణ, తమలపాకుల పూజ చేసినట్లు ఆలయ అర్చకులు అనిల్ స్వామి తెలిపారు. భక్తులకు అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేసినట్లు కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు తెలిపారు.

నేడు 'డయల్ యువర్ డిఎం'

ప్రజాశక్తి-రాయదుర్గం

స్థానిక ఆర్టీసీ కార్యాలయంలో ఆదివారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాయదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్ కె.సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున రాయదుర్గం, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు, ప్రజలు ఆర్టీసీకి సంబంధించి సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రయాణికులు సంప్రదించాల్సిన ఫోన్.99592 258 63 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు భోగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పామిడి : త్రయోదశి సందర్భంగా పెన్నానది ఒడ్డున వెలసిన స్వయంభు భోగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు రాముస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు విరివిగా వచ్చి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పేదల కల సాకారం : ఎమ్మెల్యే పద్మావతి



పట్టాలు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే పద్మావతి, నాయకులు

ప్రజాశక్తి-నార్పల

అసైన్డ్ భూముల పట్టాల కోసం ఎన్నో ఏళ్లుగా పేదలు ఎదురుచూస్తున్న కల సాకారమైందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో నియోజకవర్గవ్యాప్తంగా 302 మంది లబ్ధిదారులకు 424 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ పాలనలో పేదల కలలు సహకారం అవుతున్నాయన్నారు. తాను అసైన్‌మెంట్ కమిటీ రాష్ట్ర సభ్యురాలిగా ఇతర రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి అంశాలు తెలుసుకుని సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఎన్నో ఏళ్లుగా భూమి సాగు చేసుకుంటున్నా ఎలాంటి హక్కులు లేక చాలామంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. అలాంటి రైతులకు భూమిపై హక్కు కల్పిస్తూ భూమిని అమ్ముకునే సౌలభ్యం కూడా కల్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నాయకులు సత్యనారాయణరెడ్డి, రఘునాథరెడ్డి, నాగరత్నమ్మ, నాగేశ్వరరావు, ప్రమీల, శంకర్‌యాదవ్, మిద్దె కుళ్లాయప్ప, మండల ప్రత్యేక అధికారి మహమ్మద్ రఫీ, నార్పల తహశీల్దార్ హరికుమార్, ఎంపిడిఒ దివాకర్, డిప్యూటీ తహశీల్దార్ సురేష్, నియోజకవర్గవ్యాప్తంగా తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించాలి : మేయర్

వికసిత్ భారత్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ వసీం, నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు చేరువ చేయాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. శనివారం నగరంలోని కృష్ణ కళా మందిరంలో వికసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కేంద్ర సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను చేపట్టారన్నారు. సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నాయన్నారు. ఇలాంటి అవగాహనలు ఏర్పాటు చేయడం వల్ల అర్హులకు ఆయా పథకాలు చేరువయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమాలను ప్రజలకు వివరించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వ్యాన్లను జెండా ఊపి ప్రారంభించారు. తర్వాత ఉజ్వల భారత్ కింద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విజయ భాస్కర్‌రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, నగరపాలక కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

యువత ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న మెంటార్ సుబ్బరాజు

ప్రజాశక్తి-అనంతపురం

యువత ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని ఐక్యరాజ్య సమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్ పిలుపునిచ్చారు. 'క్యారీనౌ' సంస్థ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో యువతకు ఇంటర్న్ షిప్‌పై అవగాహన కల్పించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం ఎంతోమంది యువత డిగ్రీలు చేత పట్టుకుని బయటకు వస్తున్నారు. అయితే అందరూ ఉద్యోగులుగా స్థిరపడాలని అనుకుంటున్నారు తప్ప తామే ఉద్యోగాలు సృష్టించి ఇతరులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుకోవడం లేదన్నారు. ప్రముఖ పారిశ్రామిక వ్యవస్థాపకులు సుబ్బరాజు మాట్లాడుతూ పల్లెటూరి ప్రజలకు సేవలు అందించానే ఉద్దేశంతో తాడిపత్రి పక్కన గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి అనే యువకుడు క్యారీ నౌ అనే సంస్థను స్థాపించి ఎంతో మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చారన్నారు. అందరూ అలా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శశాంక మౌళి, వెంకట్, క్యారీ నౌ వ్యవస్థాపకులు కృష్ణారెడ్డి, అనంతపురం అర్బన్ బ్యాంక్ డైరక్టర్ సుంకర రమేష్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు వై.పవన్, ఎంటీప్రెనురార్ రాఘవేంద్రయాదవ్, భరత్‌సాయి, తేజస్విని, ఎర్రిస్వామి, క్యారీ నౌ సంస్థ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ఎపివిబిఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షులుగా నాగార్జున

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘ యువజన విభాగం జిల్లా అధ్యక్షులుగా నల్లపోతుల నాగార్జునను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయ డాక్టరు విక్రంనాయుడు తెలిపారు. ఈమేరకు శనివారం నియామక ఉత్తర్వులను నాగార్జునకు అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించినందుకు నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకూ పోరాడుతామన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు వాయిదా

అనంతపురం కలెక్టరేట్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 12న అనంతపురంలో నిర్వహించాల్సిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు చెకుముకి సైన్స్ సంబరాల కన్వీనర్ ఎస్.రిజ్వానా, అధ్యక్షులు రామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాల్సిన ఈ కార్యక్రమం 'మిచాంగ్' తఫాను కారణంగా కొన్ని జిల్లాల్లో జరిగే అవకాశం లేనందున వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి ఈ కార్యక్రమాన్ని ఈనెల 21న నిర్వహించనున్నట్లు తెలిపారు.

పునరుత్పాదక శక్తిని వినియోగించాలి

గుత్తి : పెట్రోలు, డీజిల్, బొగ్గు వినియోగాన్ని తగ్గించి వాటి స్థానంలో వనరుల కోసం పునరుత్పాదక శక్తిని వినియోగించాలని పర్యావరణ సంరక్షకులు పురుషోత్తమ్‌రెడ్డి సూచించారు. శనివారం గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 'పర్యావరణ మార్పుల వల్ల ప్రకృతి వైపరీత్యాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్ల నుంచి వాతావరణం ప్రమాదకరమైన మార్పులు చోటు చేసుకుంటున్నయని అన్నారు. రసాయన ఎరువులను వాడకుండా సేంద్రియ ఎరువుల ద్వారా పంటలు సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాతావరణ పరిరక్షణ ప్రచారకర్త నరసింహారెడ్డి, ప్రకృతి వనం వ్యవస్థాపకులు ప్రసాద్, గాయకులు లెనిన్ బాబు, గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, ప్రిన్సిపల్ డాక్టర్ సురయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి పల్లకిఉత్సవం

ఉరవకొండ : ఉరవకొండ మండలం పెన్నాఅహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకి ఉత్సవం శనివారం సాయంత్రం వైభవంగా సాగింది. ఇందులో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలువుదీర్చి ప్రదక్షిణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ్‌కుమార్, అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో పిఆర్ఆర్ విద్యార్థి ఉత్తమ ప్రతిభ

గుత్తి : క్రీడా పోటీల్లో గుత్తిలోని పిఆర్ఆర్ ఎంబిఎ కళాశాలకు చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభ చాటాడు. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఆవరణలోని క్రీడా మైదానంలో అథ్లెటిక్ పోటీలు జరిగాయి. గుత్తిలోని పిఆర్ఆర్ ఎంబీఎ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న జె.జయసాయి సుభాష్ రన్నింగ్ 800 మీటర్లు, 400 మీటర్లు, త్రో డిస్క్ పోటీల్లో ప్రథమ స్థానం నిలిచినట్లు తెలిపారు. మూడు స్వర్ణ పతకాలు సాధించాడని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసన్న కుమార్ తెలిపారు. అథ్లెటిక్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాల సాధించిన విద్యార్థి జె.జయసాయి సుభాష్ ను శ్రీ బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కృష్ణకిషోర్‌రెడ్డి, సింధూర, క్యాంపస్ ఇన్‌ఛార్జి సంతోష్‌రెడ్డి, ఎంఆర్. శ్రీకాంత్ రెడ్డి, పిఆర్ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ ప్రసన్నకుమార్, అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

గుత్తి : విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.అబుబకర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పెన్షనర్ల భవన్‌లో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి, ఐఆర్ ఇస్తామన్న జగన్ గద్దెనెక్కిన తర్వాత పట్టించుకోలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను ఇవ్వలేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఆంధ్ర పెన్షనర్ల పార్టీ అనే రాజకీయ పార్టీని ఏర్పాటైనట్లు తెలిపారు. మాజీ సిఎస్ ఎల్‌వి.సుబ్రమణ్యం, విశ్రాంత ఐఎఎస్ పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో ఏపీపీ పార్టీ కార్యకలాపాలు కొనసాగుతాయన్నారు. ఈ పార్టీలోకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విశ్రాంత ఉద్యోగులు, ప్రస్తుత ఉద్యోగుల కుటుంబ సభ్యులు చేరుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షన్ల సంఘం ఉపాధ్యక్షులు స్వర్ణాంబ, కార్యదర్శి కె. రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయి బాబు, కోశాధికారి ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన ఎస్పీ

జడ్జికి బొకే అందజేస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం : జిల్లా విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జి డాక్టర్ జస్టిస్ మన్మథరావుని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ శనివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

నేరాలు ఘోరాలు

ఫర్టిలైజర్స్ దుకాణంలో అగ్నిప్రమాదం

నార్పల : మండల కేంద్రంలోని గూగూడు రోడ్డులో ఉన్న నాగభూషణం ఫర్టిలైజర్స్ దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో దుకాణంలోని క్రిమిసంహారక మందులు అగ్నికి ఆహుతయ్యాయి. అంతేగాకుండా మందుల దుర్వాసనతో ఆ ప్రాంతం నిండిపోయింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు దుకాణ నిర్వాహకుడు నాగభూషణం సమాచారం అందజేశారు. ఆయన వచ్చి చూసేలోపు అప్పటికే దుకాణంలో ఉన్న రూ.లక్షలు విలువజేసే మందులు దగ్ధమయ్యాయి. తర్వాత దుకాణ నిర్వాహకులు పోలీసులు నీటి ట్యాంకర్‌ని తెప్పించి మంటలు అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. కాగా శనివారం నార్పల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి విషయం తెలుసుకుని అగ్నికి దహనమైన ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలించి వివరాలను యజమాని నాగభూషణంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, నిట్టూరు రఘునాథరెడ్డి, జడ్పిటిసి నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, తహశీల్దార్ రవికుమార్, ఎంపిడిఒ దివాకర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎంపిటిసిలు శంకర్‌యాదవ్, పద్మాకర్‌రెడ్డి, కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం.. అయ్యప్ప మాలధారుడు మృతి

రాయదుర్గం : రాయదుర్గం నుంచి శబరిమలకు పాదయాత్ర గా వెళున్న అయ్యప్ప మాలధారుడు కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరు వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో మృతిచెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గుమ్మగట్ట మండలం కలుగోడు గ్రామానికి చెందిన కక్కుల వెంకటేశులు మృతిచెందగా, అదే మండలంలోని గోనబావికి చెందిన గాజుల మణికంఠ, 75 వీరాపురం గ్రామానికి చెందిన ప్రహ్లాదకు కాళ్లు విరిగాయి. వివరాల్లోకి వెళ్తే... నాలుగు రోజుల క్రితం రాయదుర్గం నుంచి 30 మంది అయ్యప్ప మాలధారులు పాదయాత్రగా శబరిమలైకు బయలుదేరారు. మార్గమధ్యంలో మన రాష్ట్రం దాటి విదురాస్వత్తం మీదుగా గౌరీ బిదనూరు వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో రోడ్డు పక్కన వెళ్తున్న ముగ్గురు స్వాముల్లో వెంకటేశులు మృతిచెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని అనంతపురం సవీరా ఆసుపత్రికి తరలించారు.

గ్యాస్ సిలిండర్ పేలుడు.. తప్పిన ప్రమాదం

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని కుమ్మెత కాలనీలో నివాసం ఉంటున్న రాజారెడ్డి ఇంట్లో శుక్రవారం రాత్రి సిలిండర్ పేలింది. అయితే ఎలాంటి ప్రమాదం జరగలేదు. కుటుంబ సభ్యులతో కలిసి రాజారెడ్డి ఇంటిలో నిద్రిస్తుండగా వంటగదిలో గ్యాస్ పైపు లీకేజి కారణంగా ఒక్కసారిగా పేలిపోయింది. వంటగదికి తలుపు పెట్టి మరో గదిలో వీరు నిద్రపోవడం వల్ల వీరికి ప్రమాదం తప్పింది. లేకపోతే పెద్దప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు.

అశోక్‌నగర్ బ్రిడ్జి పనుల పరిశీలన

బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం : నగరంలోని అశోక్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి శనివారం పరిశీలించారు. అశోక్‌నగర్ మొదటి క్రాస్‌కు వెళ్లేందుకు దారి సరిగా లేకపోవడంతో అధికారులతో చర్చించారు. ఇక్కడ వాహన రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. అందుకు అనుగుణంగా అలైన్‌మెంట్ చేయాలన్నారు. అదేవిధంగా బ్రిడ్జి పక్కన డ్రెయినేజీని పరిశీలించి మురుగునీరు సాఫీగా ముందుకు సాగేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ సైపుల్లాబేగ్, పబ్లిక్ హెల్త్ ఇఇ సతీష్, నగరపాలక సంస్థ ఇఇ సూర్యనారాయణ, డీఈ సుభాష్, వైసీపీ నేతలు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రవి, జావీద్, తదితరులు ఉన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం : 2024 వివేకానంద ప్రతిభా పురస్కారాలు అందుకునేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని శారదా దేవి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ స్వామి అర్చనానంద శనివారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గానికి చెందిన బి.టెక్, ఎంబీబీఎస్, బీఫార్మసీ కోర్సుల్లో విద్యను అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులు ఈనెల 19 నుంచి 25వ తేదీలోపు ఉదయం 10 నుంచి 12 గంటల నడుమ పట్టణంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో మేనేజింగ్ ట్రస్టీని విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు కలిసి దరఖాస్తులు, అవసరమైన ధ్రువపత్రాలు అందజేయాలని కోరారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

రాయదుర్గం రూరల్ : కార్తీక శనివారం సందర్భంగా మండల పరిధిలోని మల్లాపురం సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీ నవ నరసింహస్వామి ఆలయంలో శనివారం కార్తీకదీపోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కార్యదర్శి గురురాఘవేంద్ర, కోశాధికారులు నరసింహులు, సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు గుర్నాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

పారిశుధ్యం పనులు చేస్తున్న దృశ్యం

పామిడి : మేజర్ పంచాయతీలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ సూచించారు. శనివారం పంచాయతీలోని పలు కాలనీల్లో ఉన్న మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

సమస్యలు గాలికి..విగ్రహాలపై వివాదాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనేక సమస్యలున్నాయి. ముఖ్యంగా సాగు, తాగునీరు, ఉపాధి తదితర సమస్యలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో ఈ ఎన్నికల సమీపంలోనైనా ఈ అంశాలు చర్చకొస్తాయనుకుంటే రావడం లేదు. సిపిఎం ఒక్కటే ఈ అంశాన్ని అజెండాలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. ప్రధాన రాజకీయ పార్టీలేవి ఇక్కడి ప్రధాన సమస్యలను ఎన్నికల సమయంలో అజెండా ముందు పెట్టే ఆలోచన కూడా చేయకపోవడం గమనార్హం. ఇదే సమయంలో విగ్రహాల సమస్యపై మాత్రం పెద్ద రాజకీయ దుమారాన్నే రేపుతున్నారు. ప్రధానంగా టిప్పుసుల్తాన్ విగ్రహ ఏర్పాటు అంశాన్ని బిజెపి వివాదాస్పదం చేయడం ద్వారా మత రాజకీయాలను ప్రోత్సహించేందుకు ప్రయత్నిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీని చుట్టూ గతవారంలో కదిరి, అనంతపురం నగరంలో వివాదాలు చోటు చేసుకున్నాయి. విగ్రహాలపై పెద్దఎత్తున విరుచుకుపడుతున్న బిజెపి రాయలసీమ అభివృద్ధిపై ఎలాంటి ప్రకటనలు చేయకపోవడాన్ని కొంతమంది గుర్తుచేస్తున్నారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో అనంతపురం జిల్లాకు కొన్ని హామీలిచ్చింది. ఈ హామీల్లో ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. రాయలసీమ డిక్లరేషన్ అని ప్రకటించిన ప్రకటన కూడా కాగితాలకే పరిమితమైంది. వెనుకబడి ప్రాంతాలకు కేటాయిస్తామన్న ప్రత్యేక ప్యాకేజీ గురించి ప్రస్తావించడం లేదు. ఈ ఎన్నికల సమయంలోనైనా వెనుకబడిన అనంతపురం జిల్లాకు ఏదైనా సాధించే ప్రయత్నాన్ని బిజెపి నాయకులు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే ఈవారంలో కరువు సహాయం అంశం ముందుకొచ్చింది. ప్రభుత్వమిచ్చిన మార్గదర్శకాల ప్రకారం నష్ట పరిహారం ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారు. అయితే ఈ ప్రతిపాదనల్లో మూడోవంతు మంది రైతులకు పరిహారం పరిధిలోకే వచ్చే అవకాశం లేదు. దీనిపై రైతు సంఘాలు మండిపడుతున్నాయి. వర్షాభావంతో అపారమైన నష్టం వాటిల్లి రైతులు పెద్దఎత్తున నష్టపోయారు. ఈ రైతులందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు పరిహారం అందివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు మాత్రం ఎకరానికి సగటున ఏడు వేల రూపాయలతో పరిహారం అంచనా వేసి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. అందులోనూ ఏ మేరకు రైతుకు అందుతుందన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఇకపోతే ఈ వారంలో రాష్ట్రమంతటా తుఫాను ప్రభావంతో వర్షాలు అధికంగా పడ్డాయి. పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయారు. కానీ అనంతపురం జిల్లాలో మాత్రం వర్షపాతం నామ మాత్రంగానే నమోదైంది. తుఫాను ప్రభావం కేవలం ఐదు మండలాల్లోనే ఉండటం గమనార్హం. రబీలోనూ వర్షాభావంతో పంటలు పండే పరిస్థితులు కనిపించడం లేదు. కనీసం ఆయకట్టు ప్రాంతాల్లో కూడా పంటలు చేతికందేలా లేవు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవాలకు నీళ్లు ఆగిపోవడంతో ఆయకట్టు కింద జనవరి వరకు నీళ్లొస్తాయని భావించి పంటలు సాగు చేసిన రైతులు ఇబ్బందుల్లో పడ్డారు. ఉరవకొండ, గుంతకల్లు, రాయదుర్గం నియోజకవర్గాల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీలోనూ కరువు మండలాల ప్రకటన చేయాల్సి ఉంది. రెండు సీజన్లలోనూ రైతులు నష్టపోతున్నారు. వారిని ప్రభుత్వం ఏ రకంగా ఆదుకుంటుందన్నది చూడాల్సి ఉంది. ఇప్పటి వరకు రైతులను ఆదుకునే అంశంపై ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి ప్రకటనా లేదు.